క్లుప్తంగా

పాఠశాల గేటు ప్రారంభం



గేటును ప్రారంభిస్తున్న లిఖిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు

పరిగి: మండలంలోని ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దివంగత సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, ప్రముఖ వ్యాపారవేత్త లిఖిత్‌రెడ్డి చేయూతనందించారు. పాఠశాలకు ప్రహరీ గేటు నిర్మాణంతో పాటు ఓ తరగతి గది పైకప్పు నిర్మాణానికి ఆర్థిక సాయమందించారు. బుధవారం ప్రహరీ గేటును ఎంఈఓ శేషాచలం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు బాబూల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం



ఐక్య క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం

పరిగి: ఏసుక్రీసు మార్గం అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పెనుకొండ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనంతపురం, పెనుకొండ బైబిల్ మిషన్ చర్చ్‌ల పాస్టర్లు రెడ్డివారి నాగరాజు, గోపాలరెడ్డి హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ నిరుపేదల జీవితాలలో వెలుగులు ప్రసాదించి, ప్రేమ, వాత్సల్యం, అనురాగం నింపి శాంతి మార్గాన్ని చూపేందుకే ఏసు ప్రభువు లోకంలో జన్మించారన్నారు. అనంతరం ప్రార్థనలు, క్రీస్తు గేయాలాపనలు చేశారు.

ఘనంగా ఘంటసాల జయంతి



సీనియర్ గాయకులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఇందిరా పార్కులో పద్మశ్రీ ఘంటసాల 101వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. పద్మశ్రీ ఘంటసాల కళామందిరంలో లైఫ్ వరల్డ్ సంఘం ప్రతినిధి ఉదయ్ కుమార్, లేపాక్షి వైస్ ఎంపీపీ అంజినరెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ గాయకులు ప్రసాద్‌రావు, నరసింహులును సత్కరించారు. అలాగే పట్టణంలోని ఆర్‌వీ మీలోడియస్ ఆధ్వర్యములో ఘంటసాల జయంతిని నిర్వహించారు. సంగీత కళాకారులు ఘంటసాల పాటలు పాడి వినిపించారు. కౌన్సిలర్ రమేష్‌కుమార్, ఆర్‌వీ మీలోడియస్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంఘాల నిరసన



నిరసనలో తెలియజేస్తున్న నాయకులు

హిందూపురం: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. హిందువులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అరికట్టాలని శాంతిని నెలకొల్పాలని నినాదాలు చేశారు. వివిధ పార్టీ నాయకులు, హిందూ సంఘాలు ఐక్యవేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పెట్టు.. లాభాలు పట్టు!



మల్బరీ నర్సరీకి వి.అగ్రహారం గ్రామం కేరాఫ్‌గా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా రైతులు ఇక్కడికే వచ్చి మల్బరీ మొక్కలను తీసుకెళ్తున్నారు. లాభాలు కూడా బాగుండటంతో అధిక సంఖ్యలో మల్బరీ నర్సరీ సాగుకు మొగ్గు చూపుతున్నారు.

- మల్బరీ నర్సరీకి కేరాఫ్ వి.అగ్రహారం
- వీ1 వంగడం సాగుతో లాభాలు
- బోరుబావుల కింద ఏడాదికి రెండు పంటలు తీస్తున్న రైతులు
- ఖర్చు కూడా పెద్దగా లేకపోవడంతో అధిక శాతం మంది మొగ్గు

వి.అగ్రహారంలో సాగులో ఉన్న వీ1 రకం మల్బరీ

అమరాపురం: గతంలో అమరాపురం మండలంలో మల్బరీ తోటలను సాగు చేసి ఎంతో మంది రైతులు నష్టపోయేవారు. అయితే కాల క్రమేణా పట్టు పురుగుల పెంపకంపై అధికారులు అవగాహన కల్పించడంతో రైతులకు పట్టు పురుగుల పెంపకం కంటే వీ1 రకం నర్సరీని సాగు చేస్తే లాభాలు బాగుంటాయని చెప్పారు. దీంతో మండలంలోని వి.అగ్రహారం గ్రామంలోని కొందరు రైతులు నర్సరీల సాగుకు మొగ్గు చూపారు. ఈ పంట సాగు చేయడానికి పెద్దగా ఖర్చు కాకపోవడంతో పాటు తాము సాగు చేసిన తోట వద్దకే వచ్చి రైతులు వీ1 మల్బరీ నారును తీసుకెళ్లేవారు. దీంతో రైతులకు నష్టం రాకుండా లాభాలు వచ్చాయి. గ్రామంలో బోరు బావులు ఉన్న రైతులు తోటి రైతులు సాగు చేసిన వీ1 నర్సరీలను వారు కూడా సాగుకు శ్రీకారం చుట్టారు. ఇలా గ్రామంలో 50 మందికి పైగా రైతులు 90 ఎకరాల్లో వీ1 మల్బరీని సాగు చేస్తున్నారు.

వీ1 సాగు ఇలా..

పొడవుగా ఉన్న మల్బరీ వంగడాన్ని అర అడుగు వరకూ కత్తిరించి భూమి బాగా చదును చేసిన తరువాత నాటుతారు. ఇలా నాటిన వంగడం పెద్దగా పెరుగుతుంది. మూడు నెలల వరకూ పంటకు నీరు, ఎరువును వేస్తారు. అనంతరం ఇతర ప్రాంతాల నుంచి రైతులు వచ్చిన రైతులు మొక్కలను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఒక ఎకరా సాగు చేయడానికి రైతుకు రూ.50 వేలు ఖర్చువస్తోంది. ఎకరా భూమిలో 1.2 లక్షల మొక్కలను నాటుతారు. ఇందులో కొన్ని మొలకెత్తకుండా పోగా మిగిలిన 90 వేల నుంచి లక్ష వరకూ మొక్కలు వస్తాయి. దీంతో 4 నెలల తరువాత రైతు సీజన్ దృష్టిలో ఉంచుకుని ఒక్కో మొక్కను రూ.2 నుంచి రూ.3 వరకూ అమ్ముతారు. ఈ విధంగా రైతులు వీ1 మల్బరీని సాగు చేసి అధిక లాభాలు గడిస్తున్నారు. ఎకరాకు దాదాపు రూ.1.50 లక్షలకు పైగా ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ నర్సరీని తీసుకోవడానికి తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు వచ్చి తోట వద్దే కొనుగోలు చేస్తున్నారు.



మొక్కలను తరలించేందుకు సిద్ధం చేసిన దృశ్యం

రెండు ఎకరాల్లో సాగు చేశా



నాకున్న పొలంలో బోరు బావి కింద 2 ఎకరాల్లో వీ1 నర్సరీ సాగు చేశా. 1.8 లక్షల మొక్కలు రాగా ఒక్కో మొక్కను రూ.2.50 పైసలతో అమ్మాను. మొక్కలు అమ్మగా రూ.4.5 లక్షలు వచ్చింది. 1.2 లక్షలు ఖర్చు వచ్చింది. ఖర్చులు పోనూ రూ.3.3 లక్షలు ఆదాయం వచ్చింది. దీంతో ఈ పంటనే సాగు చేస్తున్నా. ఎలాంటి నష్టం రాదు.

– సురేష్, వి.అగ్రహారం, అమరాపురం మండలం

అప్పుల బాధ తప్పింది



ఒకప్పుడు వేరుశనగ తదితర వాటిని సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను. అయితే తమ గ్రామంలో సెరికల్చర్ అధికారులు నూతన వంగడం వీ1 నర్సరీ సాగు చేయాలని అవగాహన కల్పించారు. నాటి నుంచి నేను వీ1 మల్బరీ నర్సరీ సాగు చేసి అప్పుల బాధనుంచి బయట పడ్డాను. ప్రతి ఏటా ఖర్చులు పోనూ రూ.4 లక్షల వరకూ ఆదాయం తీసుకుంటున్నా

– జగన్నాథ్, వి.అగ్రహారం, అమరాపురం మండలం

నాణ్యమైన వంగడాలు దొరికాయి



మాది కర్ణాటక రాష్ట్రం. అధికారుల సూచనల మేరకు వీ1 కొత్తరకం వంగడాన్ని సాగు చేయాలని నిశ్చయించుకున్నా. ఈ వంగడం అమరాపురం మండలం వి.అగ్రహారంలో ఉందని చెప్పారు. వీ.అగ్రహారం గ్రామానికి వెళ్లి మొక్కలు కొనుగోలు చేశాను. 5 వేల మొక్కలు తీసుకున్నాను. ఒక్కొ మొక్క రూ.2.9 పైసలు పడింది. వేరే ఏ ప్రాంతంలోనూ ఇలాంటి నాణ్యమైన వంగడాలు దొరకడం లేదు.

– రామాంజి, కర్ణాటక

పదేళ్లుగా సాగు చేస్తున్నా



మాది ఉమ్మడి కుటుంబం. పది సంవత్సరాల నుంచి బోరు బావి కింద వీ1 నర్సరీని సాగు చేస్తున్నాము. ఏడాదికి రెండు పంటలు తీసుకుంటా. పంట బాగా వస్తుంది. ఎలాంటి ఇబ్బంది లేదు. ఖర్చులు కూడా పెద్దగా ఉండవు. దీంతో మా కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా పోయింది. పిల్లలను కూడా బాగా చదివించుకో గలుగుతున్నాను.

– నటరాజు, వి.అగ్రహారం, అమరాపురం మండలం

పార్టీని మరింత బలోపేతం చేయండి



జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పలకరిస్తున్న వైఎస్ జగన్



వైఎస్ జగన్‌ను కలిసిన ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్, మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, నాయకులు



వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, సమన్వయకర్త దీపిక, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ

హిందూపురం: అందరూ సమష్టిగా పనిచేస్తూ హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఆఫీసులో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పార్టీ సమన్వయకర్త దీపిక, మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్, మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, గుడ్డంపల్లి వేణురెడ్డి కలిశారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి వారిని ఎదుర్కొన్న జేసీఎస్ కన్వీనర్ కొల్లకుంట శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేకంగా కలిసి జరిగిన సంఘటనను పార్టీ అధ్యక్షుడికి వివరించారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌పి శివ కూడా ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌ఐలుగా బాధ్యతల స్వీకరణ



రాజ కుళ్లాయప్ప



మునిప్రతాప్

హిందూపురం అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణకు పెద్ద పీట వేస్తామని ఎస్‌ఐ మునిప్రతాప్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి పెడతామన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రాజ కుళ్లాయప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు.

సంక్షిప్త సమాచారం

చింత తోపు వేలం

అగళి: మండల పరిధిలోని ఆర్‌జీ పల్లి, హనుమనపల్లి, ఇనగలూరు చింత తోపులను బుధవారం వేలం వేసినట్లు ఈఓఆర్డీ పద్మ, పంచాయతీ కార్యదర్శి రంగనాథ తెలిపారు. ఆర్‌జీ పల్లి చింత తోపును అకీమ్ సాబ్ రూ.72 వేలకు, హనుమనపల్లి చింతతోపును గిడ్డ నాగరాజు రూ.53 వేలకు, ఇనగలూరు చింతతోపును నాగరాజు రూ.50 వేలకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పరిగి: మండలంలోని ఊటుకూరు సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. వాటిని మండల తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

నేడు పరిగిలో ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ గురువారం పరిగి మండలంలో పర్యటించనున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారని పేర్కొన్నారు. అనంతరం ఊటుకూరు పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమై దిశా నిర్దేశం చేస్తారన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ఇండియన్ డిజైన్స్ వస్త్ర పరిశ్రమ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం సురేష్, హెచ్‌ఆర్‌ఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరులో 'పొలంబడి'

పరిగి: మండలంలోని ఊటుకూరు, పాత్రగానిపల్లి గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి విజయభారతి రైతులకు పలు సూచనలు చేశారు.

ప్రచార రథం ప్రారంభం

మడకశిర: మండలంలోని భక్తరహళ్ళి, జిల్లేడుగుంట లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ప్రచార రథాన్ని బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణంలో ఎండోమెంట్ అధికారులు, నాయకులు, భక్తులు ప్రారంభించారు. అలాగే బ్రహ్మోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పెనుకొండ రూరల్: ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కియా పరిశ్రమ సహకారంతో మండలంలోని గుట్టూరులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 140 మందికి పరీక్షలు నిర్వహించి 33 మందిని క్యాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నమ్మ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రొళ్లలో ఉచిత వైద్య శిబిరం

రొళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ ప్యాలెస్ కళ్యాణ మంటపం ఆవరణలో బుధవారం కర్నూలు చెందిన శ్రీచక్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది రోగులను పరీక్షించి 20 మందికిపైగా గుండె జబ్బులు, ఇతరాత్ర సమస్యలున్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి మందులు, ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ధ్వజస్తంభం ఏర్పాటు

మడకశిర: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొందిలో సర్పంచ్ గీత పంచాయతీ నిధులతో మరమ్మతుకు గురైన తాగునీటి పైపుల స్థానంలో నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించండి

చిలమత్తూరు: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా క్షయవ్యాధి అధికారి తిప్పయ్య అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి కాన్పుల గది, ల్యాబ్ రూమ్, రోగుల గదులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హిందూపురం: తిరుపతి ఎస్‌వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన భజరంగదళ్ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలి బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కోశాధికారి హరికుమార్ , న్యాయవాది సత్యనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను తరలించొద్దు

పావగడ: పట్టణంలోని ఆదర్శ విద్యాలయాన్ని దూర ప్రాంతమైన అరసికెరె గ్రామానికి తరలించొద్దని ఆ పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు ప్రకాష్‌తో పాటు పదాధికారులుఎమ్మెల్యే వెంకటేశ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం అందించారు.

పీహెచ్‌సీ తనిఖీ

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా ఆర్‌ఎస్‌కే, ఎల్‌సీడీ కో–ఆర్డినేటర్ డాక్టర్ నివేదిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పి.. అధికారం చేపట్టాక చార్జీలు పెంచి పేదల నడ్డి విరిచారని విమర్శించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితులు, గిరిజనులకు ఉచిత విద్యుత్ ఇచ్చారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌కు మంగళం పాడి వారిని మోసం చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని లేకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలి

రొళ్ల: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసగించారని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ సూపర్ హామీలు నెరవేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. పేదలందరూ సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారని వెంటనే వాటిని అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. లేకపోతే వైఎస్సార్‌సీపీ తరుపున ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు.

తాగునీటి కోసం నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

అగళి: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో నెల రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని, వెంటనే సమస్య పరిష్కరించాలంటూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తాగునీటి పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీళ్లు రావడం లేదని రంగయ్య, శ్రీనివాస్, గణేష్ తదితరులు వాపోయారు.

గుడిబండలో...

గుడిబండ: మండల పరిధిలోని శంకరగల్లులో తాగునీటి కోసం ప్రజలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పంచాయతీ బోరులో సమృద్ధికి నీళ్లున్నా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో సమస్య వచ్చిందన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

కంప్యూటర్ల వితరణ



తహసీల్దార్‌కు కంప్యూటర్‌ను అందిస్తున్న చైర్మన్

లేపాక్షి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలు అందించడానికి రెండు కంప్యూటర్లను తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ బుధవారం అందజేశారు.

ఎమ్మార్సీకి పోడియం వితరణ

పెనుకొండ: పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయానికి సభలు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుకూలంగా యూటీఎఫ్ పెనుకొండ మండలశాఖ ఆధ్వర్యంలో పోడియాన్ని బుధవారం ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్‌లకు అందించారు. నాయకులు రమేష్, ఉపేంద్ర, రవీంద్రనాథ్, నరసింహులు, రామాంజినేయులు, నరేష్, వెంకటానాయక్, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుడు నాగరాజు మృతి



నాగరాజు (ఫైల్)

హిందూపురం: స్థానిక శ్రీకంఠాపురానికి చెందిన ప్రముఖ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సీనియర్ యోగా శిక్షకుడు నాగరాజు (53) మంగళవారం రాత్రి మృతి చెందినట్లు యోగా శిక్షక బృందం తెలిపింది. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా కనకదాస జయంతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పంలో బుధవారం కనకదాసు జయంతి వేడుకలను కురుబ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ పిల్లలు ఉన్నతస్థాయికి ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

రైతుల సంక్షేమం పట్టదా?

- డైవర్షన్ డ్రామాలకు కేరాఫ్ చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మాట్లాడుతున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించి రైతులను కష్టాల్లోకి నెట్టేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. బుధవారం ఆయన గౌడనహళ్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసగించడానికి డైవర్షన్ డ్రామాలకు తెరలేపారన్నారు. ఆయనకు రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైన రూ.20 వేల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లోకి జమ చేయలేదన్నారు. అప్పులు చేసి రైతులు పంటలను సాగు చేసే పరిస్థితిలోకి తీసుకొచ్చారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించి రైతుకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు, ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జమ్మానిపల్లి మూర్తి, సర్పంచ్ హనుమంతరాయప్ప, వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నాగరాజుగౌడ్, ఎంపీటీసీ మలేరంగప్ప, నాయకులు నర్సేగౌడ్, మాల్లేగౌడ్, చిరంజీవి, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.